స్వర్ణతాపడం తర్వాత
మహాకుంభాభిషేకం
- మార్చి 1 నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు
- ఈలోగా స్వర్ణతాపడం పనుల పూర్తికి చర్యలు
- సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

7

వలిగొండ మండలం సంగెం బ్రిడ్జి వద్ద సీఎం పర్యటనకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి, ఎంపీ చామల, ఎమ్మెల్యే కుంభం



పునరుజ్జీవంపై ఆశలు

- మూసీ పరివాహకంలో పర్యటిస్తున్న తొలి సీఎం రేవంత్‌రెడ్డి
- పాదయాత్రతో రాత మారుతుందని రైతుల అభిప్రాయం
- గోదావరి జలాల తరలింపుపై ప్రకటన చేసే అవకాశం

నల్లగొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శుక్రవారం మూసీపరివాహక ప్రాంతంలో పాదయాత్ర చేపడుతుండడంతో ఈ ప్రాంత వాసుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. మూసీ కాలుష్యంతో ఇబ్బంది పడుతున్న పరివాహక ప్రాంతంలో ఇప్పటివరకు ఏ సీఎం పర్యటించలేదని, మొదటి సారి రేవంత్‌రెడ్డి సీఎం హోదాలో వస్తుండటంతో తప్పక మేలు జరుగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. మూసీపై బునాదిగాని, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, భీమలింగం, అసిఫ్‌నహర్ కాల్వల ద్వారా ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాల్లో విస్తరించిన ఈ కాల్వల ఆధునీకీకరణకు ఉద్దేశించిన పథకాలు, పనులు సీఎం పర్యటన తర్వాత ఊపందుకోనున్నాయి. అంతేగాక మూసీ నది ప్రక్షాళనతో పాటు, సమాంతరంగా మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను తీసుకువచ్చి మూసీ నదిలో కలపడం ద్వారా ఈ ప్రాంతానికి శాశ్వతంగా సాగు, తాగునీటి ఇబ్బందులు తప్పిస్తామని మంత్రులు, మిగతా 8వ పేజీలో

నేడు యాదాద్రి జిల్లాకు సీఎం
- పుట్టినరోజు సందర్భంగా గుట్ట నృసింహుడిని దర్శించుకోనున్న రేవంత్‌రెడ్డి
- ప్రెసిడెన్షియల్ సూట్‌లో సమీక్ష
- అనంతరం సంగెం వద్ద మూసీ పునరుజ్జీవ సంకల్ప యాత్ర ప్రారంభం

6



కొను ఘొల్లు

- పంట విక్రయించేందుకు అన్నదాత అగచాట్లు
- సన్నధాన్యం కొనుగోలు చేయని మిల్లర్లు
- తగ్గుతున్న ధాన్యం ధరలు
- ఆందోళనలో రైతులు

8

ఆరుగాలం శ్రమించి ధాన్యాన్ని విక్రయించేందుకు అన్నదాతకు ఇబ్బందులు తప్పడం లేదు. మిల్లర్లు సిండికేట్‌గా మారి ధరలో కోత విధిస్తున్నారు. క్వింటాకు రూ.2300 నుంచి రూ.2350 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ఈ సారి సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించడంతో ఆయకట్టు రైతులు సన్నాల సాగుకే మొగ్గు చూపారు. అయితే మిల్లర్లు అన్ని రకాల సన్నాల ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

● ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ, మిర్యాలగూడరూరల్

న్యూస్ బాక్స్

ఆశాల సేవలు కీలకం
డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

నల్లగొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో ఆశా కార్యకర్తల సేవలు ఎంతో కీలకమైనవని డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన నల్లగొండ డివిజన్ ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఆశా కార్యకర్తలు ముందుండాలన్నారు. జాతీయ ఆరోగ్య పథకాలు అందరికీ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణకుమార్, కల్యాణ్ చక్రవర్తి, పద్మ, దుర్గయ్య, రాజేష్, ఆశా కోఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి, శాంతాకుమారి, వెంకటేశ్వర్లు, అనీష్, మహేశ్వరి, పాల్గొన్నారు.

ఆలిండియా మహాసభలను
విజయవంతం చేయాలి
యూఎస్ఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి పరశురాం



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న పరశురాం

నేరేడుగొమ్ము, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా మహాసభలను విజయవంతం చేయాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కలమూరి పరశురాం అన్నారు. గురువారం నేరేడుగొమ్ము ఆదర్శ పాఠశాలలో యూఎస్ఎఫ్ఐ ఆలిండియా మహాసభల కరపత్రాలను విడుదలచేసి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో డిసెంబరు 14, 15న అఖిలభారత మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యకు 10శాతం, జీడీపీలో 6శాతం నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నేరేడుగొమ్ము మండల యూఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు ఆడెపు వీరేందర్, కేతావత్ నితిన్‌నాయక్, సంతోష్, యోగిసింగ్, అంజలి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 26న
శత వార్షికోత్సవం
సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న సత్యం

నార్కట్‌పల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆవిర్భవించి డిసెంబరు 26 నాటికి వందేళ్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా నిర్వహించే శత వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టుకు నిధులు కేటాయించి సత్వరమే పూర్తిచేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి లొడంగి శ్రవణ్‌కుమార్, గౌని అక్బర్, వెంపటి శ్రీనివాస్, వంగాల నాగయ్య, సంగిశెట్టి శ్రీనివాస్, పులుసాని అనంతరెడ్డి, తీగల పిచ్చిరెడ్డి, బోడ మల్లేశ్, ఉపేందర్, వెంకటయ్య, చిన్న వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి
కలెక్టర్ ఇలా త్రిపాఠి





మిర్యాలగూడలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, నల్లగొండలో సర్వేలో పేరు నమోదు చేయించుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ రూరల్, దామరచర్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యతా ప్రమాణాల మేరకు ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర, బోనస్ పొందాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మండలంలోని యాద్గార్‌పల్లి పంచాయతీ వైష్ణవి రైస్ మిల్లును ఆమె తనిఖీచేసి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 340 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో 82సన్నరకం, 258 దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో 7.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేయగా, 2.80లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం, 4.70లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యం ఉంటుందన్నారు. ఇప్పటి వరకు సుమారు 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రూ.7కోట్లు రైతులకు చెల్లించామన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర, బోనస్ పొందాలన్నారు. ధాన్యాన్ని నిల్వ చేసేందుకు జిల్లా వ్యాప్తంగా ఆరు గోదాములు ఏర్పాటు చేశామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా కలెక్టర్ దామరచర్ల మండలంలోని వాడపల్లి మీనాక్షి అగస్త్యేశ్వర స్వామి ఆలయం, లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆమె వెంట సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మిర్యాలగూడ తహసీల్దార్ హరిబాబు, డీటీ జావిద్, మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు కర్నాటి రమేష్, గౌరు శ్రీనివాస్, వెంకటరమణచౌదరి, కర్నాటి లక్ష్మీనారాయణ, ఉన్నారు.

సర్వే సిబ్బందికి సమాచారాన్ని ఇవ్వాలి
(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ): సర్వే సిబ్బందికి సరైన సమాచారాన్ని ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. పట్టణంలోని నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా పూర్తి వివరాలు ఎన్యూమరేటర్లకు అందించాలన్నారు. ఆమె వెంట మునిసిపల్ కమిషనర్ యూసుఫ్, కౌన్సిలర్ నర్సిరెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఉన్నారు.

పేరు నమోదుచేయించుకున్న కలెక్టర్
(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల, సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఇంటికి వచ్చిన ఎన్యూమరేటర్ వద్ద కలెక్టర్ ఇలా త్రిపాఠి పేరు నమోదు చేయించుకున్నారు. సర్వే నిమిత్తం కలెక్టర్ ఇంటికి వచ్చిన ఎన్యూమరేటర్ అయేషా అమీరాకు పూర్తి వివరాలు అందజేశారు. అనంతరం కలెక్టర్ ఇంటికి ఎన్యూమరేటర్ స్టిక్కర్ అంటించ వెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ సమగ్ర సర్వేకు సంబంధించిన స్టిక్కర్, మ్యాప్, ఎన్యూమరేటర్ ఐడీకార్డును పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో అశోక్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్, సూపర్‌వైజర్ రోహిత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి
డీసీహెచ్ఎస్ మాతృనాయక్



ఆస్పత్రిలో ఓ రోగితో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ మాతృనాయక్

దేవరకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు వైద్యులు, సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) మాతృనాయక్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన తనిఖీ చేసి రోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దేవరకొండ ఆస్పత్రికి రెండున్నర లక్షలతో ఎమ్మెల్యే బాలునాయక్ సహకారంతో 5వేల లీటర్ల సామర్థ్యం ఉన్న వాటర్ ప్లాంట్ మంజూరైందని, త్వరలో పనులు పూర్తవుతాయని అన్నారు. వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చూపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ప్రభుత్వ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మంగ్తానాయక్, డాక్టర్ కృష్ణ, తదితరులు ఉన్నారు.

కొనుగోళ్లలో మోసాలకు పాల్పడితే చర్యలు



పత్తి కొనుగోలు కేంద్రంలో తక్ పట్టీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

అదనపు కలెక్టర్ శ్రీనివాస్

మునుగోడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంట ఉత్పత్తుల కొనుగోళ్లలో ఎలాంటి మోసాలకు పాల్పడినా చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. మునుగోడులోని శ్రీబాలాజీ సలాసర్ పత్తి జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తేమ శాతం అధికంగా లేకుండా ఉన్న పత్తిని రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. పత్తి కొనుగోలులో ఏమాత్రం జాప్యం చేయవద్దని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీదేవి, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, తహసీల్దార్ నరేందర్, ఇన్‌చార్జి ఎంపీడీవో విజయ్‌భాస్కర్, చండూరు ఏఎంసీ కార్యదర్శి కత్తుల రవి, సూపర్‌వైజర్ రాజేందర్, సీసీఐ బయ్యార్ నింజా, తదితరులు ఉన్నారు.

గడువులోగా సర్వే పూర్తి చేయాలి
(ఆంధ్రజ్యోతి, మునుగోడు రూరల్): ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సమగ్ర కుటుంబ సర్వేను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. గురువారం మండలంలోని కొంపల్లి గ్రామంలో సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బాధ్యతాయుతంగా వివరాలు నమోదు చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటుచేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేశారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని ఆదేశించారు.

కాంగ్రెస్ సేవాదళ్ పటిష్ఠం చేయాలి
టీపీసీసీ సేవాదళ్ ఉపాధ్యక్షుడు ముంఖాల దాసు



సమావేశంలో మాట్లాడుతున్న ముంఖాల దాసు

నల్లగొండ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ సేవాదళ్‌ను పటిష్ఠం చేయాలని టీపీసీసీ సేవాదళ్ ఉపాధ్యక్షుడు, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి ముంఖాల దాసు అన్నారు. గురువారం మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ సేవాదళ్ ముఖ్యపాత్ర పోషించిందన్నారు. ఈనెల 20న గాంధీభవన్‌లో నిర్వహించనున్న అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాడు బ్రిటీష్ పాలకుల నుంచి విముక్తి కల్పించేందుకు అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ ఉద్యమం చేస్తే, నేడు రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ యాత్ర చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. సమావేశంలో సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి గండూరి నర్సింహ, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మేకల సాగర్‌రెడ్డి, సూర్యాపేట జిల్లా సేవాదళ్ మహిళా అధ్యక్షురాలు శకుంతల, జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్ఫాన్, కార్యదర్శి అవాంచల వెంకటేష్, ప్రమీల, ఆకుల పరమేశ్వరి, రాజేందర్ ప్రసాద్, తదితరుల పాల్గొన్నారు.

ఎర్రజెండా చేయని
పోరాటాలు లేవు
సీపీఎం నాయకుడు బండ శ్రీశైలం

మర్రిగూడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కష్టజీవులకు అండ ఎర్రజెండా చేయని పోరాటం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన మహాసభల్లో వారు మాట్లాడారు. స్థానిక సంస్థలకు నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది ఎర్రజెండానే అని అన్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు చేసిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నాంపల్లి చంద్రమౌళి, మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, బోట్ట శివకుమార్, నీలకంఠ రాములు, కొట్టం యాదయ్య, చెల్లం ముత్యాలు, గడగూటి వెంకటయ్య, పాల్గొన్నారు.

మత్స్యకార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
ఎమ్మెల్యే బాలునాయక్



వైజాగ్‌కాలనీ బ్యాక్ వాటర్‌లో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

నేరేడుగొమ్ము, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీ నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్‌లో 13లక్షల చేప పిల్లలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు వారి రాజకీయ లబ్ధికోసం ప్రజలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. మత్స్యకార్మికులు కృష్ణానదిలో అలిమి వలలతో చేపలు పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లోకసాని కృష్ణ, జడ్పీ మాజీ సభ్యుడు బాలు, వేణుధర్‌రెడ్డి, యుగేందర్‌రెడ్డి, పాపనాయక్, కిన్నెర హరికృష్ణ, మల్లారెడ్డి, బంగారి, నిరీక్షన్, బద్యనాయక్, సాధిక్, మత్స్యశాఖ అధికారులు సుచరిత, మారయ్య, తదితరులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి, కొండమల్లేపల్లి): ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పెండ్లిపాకల రిజర్వాయర్‌లో చేప పిల్లలను వదిలి మాట్లాడారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన 4.5 లక్షల మూడు రకాల చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి సుచరితరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జమున మాధవరెడ్డి, శక్రునాయక్, నేనావత్ శంకర్‌నాయక్, మధునాయక్, మాద్గుల యాదగిరి, పాల్గొన్నారు.

కళాశాలల్లో క్రీడా సదుపాయాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండస్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని ప్రతి కళాశాలలో క్రీడల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని ఎంజీయూ వైస్ చాన్సలర్ ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ సూచించారు. యునివర్సిటీలో గురువారం జరిగిన స్పోర్ట్స్ బోర్డు సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయం పరిధిలో అంతర్ కళాశాలల టోర్నమెంట్స్ నిర్వహించాలని, 34 క్రీడాంశాలకు అదనంగా మహిళలకు జిమ్నాస్టిక్స్, సాఫ్ట్‌బాల్ చేర్చాలన్నారు. ప్రతీ కళాశాలలో క్రీడామైదానాలు ఉండాలని, విద్యార్థులను ఆటల్లో ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ హరీష్ కుమార్, ఓఎస్‌డీ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, సీవో డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, పీడీలు డాక్టర్ మురళి, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్‌రావు, స్వప్న, పాల్గొన్నారు.

గ్రామస్థుల ఔదార్యం



తాళం చెవి అందిస్తున్న ఎస్ఐ, దాతలు

కోదాడ రూరల్, నవంబరు7 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని కాపుగల్లు గ్రామానికి చెందిన కాసాని తిరుపతిరావు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రెండు నెలల క్రితం ఆటోను రాత్రి ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. ఉదయం లేచి చూసేసరికి ఆటో దగ్ధ మైంది. దీంతో తీవ్ర ఆందోళన గురైన తిరుపతిరావు కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే ఆటో లేకపోవడంతో జీవనోపాధి కోల్పోయిన తిరుపతిరావు ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమం లో గ్రామ మాజీ సర్పంచ్ తొండపు సతీష్ ఆధ్వర్యంలో దాతలు తొండపు సుధీర్‌కుమార్ అలియాస్ బుడ్డి, నంబూరి సూర్యం, ముత్తవరపు గిరిధర్‌రావు, బాలెబోయిన రాజు మరికొంతమంది సహకారంతో రూ. 75 వేల ను బ్యాంకులో జమచేసి ముద్రా లోన్ కింద రూ.3 లక్షల విలువైన ఆటో ను మంజూరు చేయించారు. దీంతో రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి గురు వారం తిరుపతిరావుకు అందించారు. ఎస్ఐ మాట్లాడుతూ దాతల దాతృత్వం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రామారావు, ముత్తవరపు వీరయ్య, కోటేశ్వరరావు, బోసు,సుధాకర్, రాంకోటేశ్వరరావు, బోసు, వేణు తదితరులు పాల్గొన్నారు.

పరుగుతో పతకమే

మైదానంలో అతడు కాలు పెడితే మెడలో పతకం పడాల్సిందే. ఒక వైపు హెడ్‌కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తూనే మరోవైపు అథ్లెటిక్స్ పోటీల్లో రాణిస్తున్నాడు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రానికి చెందిన అనిల్‌కుమార్. ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూనే అథ్లెటిక్స్‌లో అంతర్జాతీయ టోర్నీ వరకు 100కు పైగా పతకాలు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.
(ఆంధ్రజ్యోతి-భువనగిరిటౌన్)

- పరుగు పందెం పోటీల్లో రాణిస్తున్న భువనగిరి హెడ్ కానిస్టేబుల్ అనిల్
- ఇప్పటి వరకు 100పైగా పతకాలు
- అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లోనూ పతకాలు





అనిల్‌కుమార్‌ది మధ్యతరగతి కుటుంబం. 45 ఏళ్ల అనిల్ స్థానికంగానే విద్యాభ్యాసం పూర్తిచేసి 2004 జనరల్ కేటగిరిలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని భువనగిరిలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అయితే 1996లో 10వ తరగతి చదువుతూ ఆటలపై ఆసక్తితో భువనగిరిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానానికి ప్రతి నిత్యం వెళ్లేవాడు. అదే సమయంలో విద్యార్థులకు శిక్షణఇస్తున్న స్థానిక ప్రభుత్వ గంజ్ హైస్కూల్ పీఈటీ హనుమంతరావు దృష్టిని ఆకర్షించాడు. ఈ మేరకు అప్పటినుంచి తనకు నచ్చిన పరుగు పందెంలో ప్రతిభ చాటుతూ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడిగా గుర్తింపు పొందాడు. ఉంటే ఉద్యోగంలో లేదంటే మైదానంలో గడిపే యువతకు, క్రీడాకారులకు, సహచర పోలీసులకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.

పోటీలకు, శిక్షణకు సొంత డబ్బే..



జిల్లా పోలీస్ ఉత్తమ అవార్డు అందుకుంటున్న అనిల్

అనిల్‌కుమార్‌కు ఏకైక ఆదాయ మార్గం నెల వేతనమే. ఆ మొత్తంతోనే కుటుంబాన్ని నడుపుతూ క్రీడాకారుడిగా అవసరమైన శిక్షణ, శారీరక పటుత్వం కోసం పౌష్టికాహారానికి వినియోగిస్తారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వెళ్లేందుకు ప్రయాణ చార్జీలు అతనే భరిస్తుం టాడు. ఇందుకోసం ఆర్థిక ప్రణాళికను పకడ్బందీగా పాటిస్తుంటారు. అనిల్ ఖర్చుల కోసం కుటుంబసభ్యులు తమ ఖర్చులను తగ్గించుకున్న సందర్భాలూ అనేకం. ఇదిలా ఉండగా అనిల్ తన పరిధిలోని క్రీడాకారులను కూడా ప్రోత్సహిస్తుండడం విశేషం. అయితే టోర్నీల్లో పాల్గొనేందుకు పోలీసు శాఖ వేతనంతో కూడిన స్పెషల్ సెలవులను మంజూరుచేస్తూ, పతకాలు సాధిస్తే రూ.5,రూ.10 వేలు రివార్డుగా ఇస్తూ అధికారులు ప్రోత్సహిస్తున్నారు.

అనిల్‌కుమార్‌కు పరుగు పందెంలో అన్నిస్థాయిల్లో 100కు పైగా పతకాలు సాధించారు. అతడి ఇంటిగోడల నిండా పతకాలు, ప్రశంసాపత్రాలు, మెమెంటోలే కనిపిస్తాయి. ఇవే ఆ ఇంటికి శోభను ఇస్తుంటాయి. అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌లో అనిల్ స్వర్ణ, రజత, 4 కాంస్య పతకాలు సాధించారు. 2024 అక్టోబరు 12, 13 తేదీల్లో మలేషియాలో నిర్వహించిన 36వ మాస్టర్ ఇంటర్నేషనల్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ టోర్నీలో 400మీటర్ల రిలే ఈవెంట్‌లో దేశానికి రజత పతకం తెచ్చాడు.అదేవిధంగా అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో 800, 1500, 5000మీటర్ల పరుగుపందెంలో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి, దేశానికి పతకాల తెచ్చిపెడుతున్నాడు. పతకం సాధించిన ప్రతీ సందర్భంలో పోలీస్ ఉద్యోగిగా ఆ శాఖకు, అదేవిధంగా భువనగిరి కూడా ప్రత్యేక గుర్తింపు తెస్తున్నారు అనిల్.

ఆరోగ్యం సహకరించే వరకూ పోటీలకు..



అథ్లెటిక్స్ పోటీలంటే నాకు ప్రాణం. క్రీడాకారుడిగా గుర్తింపు ఆనందాన్ని ఇస్తుంది. ఆరోగ్యం సహకరించే వరకు పోటీలో పాల్గొంటా. నా గురువు హనుమంతరావు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్, పోలీస్ ప్రోత్సాహంతోనే క్రీడాకారుడిగా రాణిస్తున్నా. కుటుంబసభ్యుల సహకారం ఎంతో ఉంది.

అనిల్‌కుమార్, అథ్లెటిక్స్ క్రీడాకారుడు, భువనగిరి

కథల పోటీల్లో గుండ్రాంపల్లి విద్యార్థిని ప్రతిభ



శిరీష

చిట్యాలరూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో జరిగిన కథల పోటీల్లో పాల్గొన్న నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లికి చెందిన 10వ తరగతి విద్యార్థిని కంకల శిరీషకు తృతీయ బహుమతి ప్రకటించినట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మాసారాం శ్రీనివాసులు ప్రధానోపాధ్యాయుడు మాసారాం శ్రీనివాసులు తెలిపారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గత నెల 5 నుంచి 20వ వరకు ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన కథలు, వచన కవిత, పద్యకవిత, చిత్రలేఖనం విభాగంలో పోటీలు నిర్వహించారు. గుండ్రాంపల్లి జడ్పీహెచ్ఎస్ నుంచి పోటీలో పాల్గొన్న శిరీష 'మార్పు' కథ రాసింది. రాసిన కథను పోస్టుద్వారా సంబంధిత నిర్వాహకులకు పంపించగా శిరీష రాసిన మార్పు కథను న్యాయ నిర్ణేతలు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కథకు తృతీయ బహుమతిని ప్రకటించారు. ఈనెల 15న హైదరాబాద్‌లో అబిడ్స్‌లోని తెంగాణ సారస్వత్ పరిషత్ డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగే బాలల సాంస్కృతికోత్సవంలో నగదు బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందజేయనున్నారు. శిరీషను ఉపాధ్యాయులు అభినందించారు.

నీటి విడుదల నిలిపివేత

నార్కట్‌పల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టు రిజార్వయర్‌లోకి నీటి విడుదలను అధికారులు గురువారం సాయంత్రం నుంచి నిలిపివేశారు. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 0.3టీఎంసీలు కాగా గత పది రోజులుగా ఒక మోటారును నడిపిన అధికారులు రిజర్వాయర్‌లోకి 0.2 టీఎంసీల మేర నీటిని నింపారు. ప్రస్తుతానికి రిజర్వా యర్‌లోకి నీటి విడుదలను నిలిపి వేశారు.

నేడు యాదాద్రిలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

- పుట్టినరోజును పురస్కరించుకుని కుటుంబ సమేతంగా రాక
- యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి దర్శనం
- ప్రెసిడెన్షియల్ సూట్‌లో అధికారులతో సమీక్ష

యాదాద్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లాలో పర్యటిస్తారు. సీఎం జన్మదినాన్ని పురస్కరించుకుని యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవం కార్యక్రమంలో భాగంగా నది పరివాహక ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో మమేకం కానున్నారు. ఈ మేరకు జిల్లా యం త్రాంగం ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేసింది. సీఎం పర్యటన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. యాదగిరిగుట్టతో పాటు వలిగొండ మండలం సంగెం అండర్ బ్రిడ్జి వద్ద కట్టుదిట్టమైన పోలీసు భద్రతను ఏర్పాటుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉదయం 9గంటలకు బేగంపేట్ ఎయిర్‌పోర్టుకు చేరకుంటారు. 9.20గంటలకు యాదగిరిగుట్టకు హెలీప్యాడ్ ద్వారా కుటుంబ సమేతంగా చేరుకుంటారు. హెలీప్యాడ్ నుంచి వాహనాల్లో 9.30నుంచి10 గంటల వరకు యాదగిరిగుట్టలోని ప్రెసిడెన్షియల్ సూట్‌కు చేరుకుంటారు. ఉదయం 10.05 గంటల నుంచి 11.15 గంటల వరకు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారికి ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. 11.20 ప్రెసిడెన్షియల్ సూట్ చేరుకుని, 11.30గంటల ను ంచి ఒంటిగంటకు వరకు ఆలయ అభివృద్ధి పనులపై వైటీడీఏ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తారు. ఒంటి గంట నుంచి 1.30వరకు భోజనం. 1.30 గంటలకు ప్రెసిడెన్షియల్ సూట్ నుంచి రోడ్డుమార్గంలో వలిగొండ మండలం సంగెం బయలుదేరుతారు. 2.10 నుంచి 3గంటల వరకు బీమలింగం వద్ద పూజల్లో పాల్గొని, పాదయత్రను చేపడతారు. 3నుంచి4గంటల వరకు రెండున్నర కిలోమీటర్ల వరకు పాదయాత్రను చేపట్టనున్నారు. 4నుంచి 4.30గంటలకు ధర్మారెడ్డి కాలువ మీదుగా సంగెం-నాగిరెడ్డిపల్లి మెయిన్ రోడ్డుకు చేరుకుంటారు. నాగిరెడ్డిపల్లి వద్ద 4.30నుంచి5గంటలవరకు ము ఖ్యమంత్రి వాహనం నుంచి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారు. సాయంత్రం 5గంటలకు సంగెం నుంచి హైదరాబాద్‌కు బయలుదేరుతారు.



గుట్టలో హెలీప్యాడ్ వద్ద బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు



యాదగిరికొండపై పోలీస్ బందోబస్త్

సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి...

సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లాయంత్రాంగం తగిన చర్యలు చేపట్టింది. వలిగొండ మండలం సంగెం వద్ద భీమలింగానికి పూజలు నిర్వహించిన అనంతరం పునరుజ్జీవం యాత్రను చేపడతారు. ఈ మేరకు భీమలింగం వరకు దారిని ఏర్పాటుచేశారు. అనంతరం ధర్మారెడ్డికాలువ ద్వారా సీఎం యాత్రను చేపట్టనున్నారు. భద్రతా సిబ్బంది బాంబుస్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. సీఎం పర్యటన నేపథ్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు, డీసీపీ ఎం.రాజేష్ చంద్ర, ఆలయ ఈవో ఎ.భాస్కర్‌రావుతో కలిసి యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ప్రధానాలయంతో పాటు ఆలయ పరిసరాలు, కొండకింద, పెద్దగుట్టపై హెలిప్యాడ్ స్థలం, ప్రెసిడెన్షియల్ సూట్లు పరిశీలించి పలు శాఖల అధికారులతో సమీక్షించారు. సీఎం పర్యటనలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా పటిష్ఠమైన భద్రత ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీఎం సెక్యూరిటీ సిబ్బంది సైతం సీఎం పర్యటించనున్న విష్ణుపుష్కరిణి, అఖండ దీపం, తూర్పు రాజగోపురం ద్వారా ఆలయంలోకి వెళ్లి స్వయంభువుల దర్శనం, వేద ఆశీర్వచనం మండపం, ఆలయ పరిసరాలు తదితర ప్రదేశాలను పరిశీలించారు. సీఎం పూజలు నిర్వహించే భీమలింగం వరకు సీఎం ప్రయాణించే వాహనాన్ని ట్రయల్ రన్ నిర్వహించారు.

చేనేతపై ప్రతికూల ప్రభావం



కలుషితమైన మూసీనీటితో చేనేత రంగంపై ప్రతికూల ప్రభావం ఏర్పడింది. నూలుకు రంగులు అద్దె సమయంలో తేడా వచ్చి వినియోగదారులకు నాణ్యత లోపించినట్లు కనబడుతోంది. దీంతో కులవృత్తుని సాగించలేక ఇతర చోట్ల తయారైన రంగులు అద్దిన నూలును ఇతర ముడి పదార్థాలు తెచ్చి కూలికి వస్త్రాన్ని తయారుచేస్తే గిట్టుబటు కావడంలేదు. ఆర్థికంగా వెనుకపడిపోతున్నాం. మూసీ ప్రక్షాళనతో పాటు మా వృత్తులను ఆదుకోవాలి.

-పగ్గిల బజార్, రజక వృత్తి.

ఉపాధి లేక వలస వెళ్లా



మూసీనది మంచినీరుగా ఉన్నపుడు గ్రామస్థుల దుస్తువులను ఆ నీటిలో ఉతికేవాళ్లం. తమ కుటుంబం రజక వృత్తిపై ఆధారపడింది. రానురాను మూసీ కలుషితం కావడంతో బట్టలను ఈ నీటిలో ఉతికితే రంగుపోతోంది. దీంతో బట్టలను మూసీ నీటితో ఉతకవద్దని తమ ఇళ్ల వద్దనే ఉతికి ఆరవేయాలని ప్రజల అనడంతో అందరూ ఇళ్లలోకి వెళ్లడం సాధ్యంకాలేకపోతోంది. అందరి దుస్తువులను ఓకే దగ్గర ఉతకాలంటే సరైనా నీరు స్థలం లేక రజక వృత్తి దెబ్బతింది. ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లాల్సి వచ్చింది. కుటుంబసభ్యులు అందరూ గ్రామంలో ఉంటే నేను పట్టణంలో ఉంటే ఇబ్బంది కారంగా మారింది. మూసీ నదీ ప్రక్షాళన చేస్తే మాకు తిరిగి మంచిరోజులు వస్తాయి.

-చిలుక నాగరాజు, చేనేత వృత్తిదారుడు

మా ఊరికి సీఎం రావడం సంతోషం



సీఎం రేవంత్‌రెడ్డి సారు మా ప్రాంతానికి రావడం సంతోషకంగా ఉంది. మూసీనదీ నీటితో సాగు పనులకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. పొలంలో దిగితే శరీరంపై దురద వస్తోంది. కూలి పనులు చేయలేకపోతున్నాం. మూసీ మురుగుతో పొలం దిగుబాటుకు గురై ఆసాములు మాలాంటి ముసలోళ్లను పనులకు పిలవడం లేదు. ఆర్థికంగా ఇబ్బందిగా ఉంది, ఈ మూసీనదిని మంచినీరుగా మార్చాలి.

- పగిళ్ల శంకరమ్మ

మూసీ ప్రక్షాళనతో ప్రజల జీవన స్థితిగతుల్లో మార్పు



సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మూసీ ప్రక్షాళనతో లక్షలాది మంది జీవన స్థితిగతులను మార్చాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ఆశయమని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. శుక్రవారం సీఎం మూసీ పునరుజ్జీవ పాదయాత్రను పురస్కరించుకొని గురువారం యాదాద్రి జిల్లా వలిగొండ మండలం సంగెం వద్ద ఏర్పాట్లను ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల విలేకరులతో మాట్లాడుతూ ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో ఉన్న మూసీనది మురికికూపంగా మారిందన్నారు. మూసీ ప్రక్షాళనకు అన్ని ప్రభుత్వాలు ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదని, కానీ నేడు సీఎం మూసీ ప్రక్షాళనకు తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైనదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇది కష్టమైనప్పటికీ ఖచ్చితంగా మూసీనదికి ప్రక్షాళన చేస్తామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు మూసీ నది లక్షలాది మందికి సాగు, తాగునీరు ఇచ్చిందన్నారు. అలాంటిది నేడు నది వెంట వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. దుర్గంధంతో ఉన్న మూసీ నదికి ప్రక్షాళన తర్వాత సాగు, తాగునీటిని అందించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. మ్యానిఫెస్టోలో లేకున్నా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల ఆరోగ్యాలకు కాపాడేందుకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఆర్‌డీఏ నాగిరెడ్డి, డీపీవో సునంద పాల్గొన్నారు.

మంత్రులకు స్వాగతం

భువనగిరి టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం తుర్కపల్లికి వెళ్తున్న మంత్రులకు భువనగిరిలో స్థానిక కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. కార్యక్రమంలో మునిసిపల్ మాజీచైర్మన్ బర్రె జహంగీర్, రహమాన్, మజహర్, బాలేశ్వర్, శరత్‌యాదవ్ పాల్గొన్నారు.

మూసీ పునరుజ్జీవంపై ప్రభుత్వ ప్రణాళిక తెలపాలి

భువనగిరి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మూసీ పునరుజ్జీవంపై పరివాహక ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం పాదయాత్ర చేయనున్న నేపథ్యంలో ఆయనకు సీపీఎం బహిరంగ లేఖ రాసింది. ఐదు ప్రధాన సమస్యలను ప్రస్తావిస్తూ సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ గురువారం భువనగిరిలో లేఖను విడుదల చేశారు. మూసీ పునరుజ్జీవంపై ప్రభుత్వ ప్రణాళికను బహిరంగపరచాలని, చేపట్టే పనులపై అఖిలపక్షంతో చర్చించాలని, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎస్టీపీలు ఏర్పాటుచేయాలని, మూసీని కలుషితం చేస్తున్న పరిశ్రమలను గుర్తించి చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని స్పెషల్‌జోన్‌గా గుర్తించి అభివృద్ధి చేయాలన్నారు. మూసీ కాలుష్యంతో తలెత్తిన ఆరోగ్య సమస్యలపై సర్వే జరిపి బాధితులకు ప్రభుత్వం ఉచిత వైద్యసేవలు అందించాలన్నారు. బస్వాపూర్ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను కేటాయించి ప్రతిపాదిత పనులు పూర్తిచేయాలని, ఈ మేరకు సీఎం మూసీ యాత్రలో స్పందించాలన్నారు. మూసీ నది పునర్జీవనం హైదరాబాద్‌కే పరిమితం చేస్తారా లేక నది ఆసాంతం పనులు చేస్తారా బహిరంగంగా ప్రకటించాలని, పునర్జీవన పనులు పూర్తయ్యాక గోదావరి జిల్లాలను మూసీనదిలోకి తరలించాలని సీఎంను కోరారు. మూసీనదీ పునరుజ్జీవన ప్రయత్నాలను సీపీఎం స్వాగతిస్తోందని అయితే నదీ ప్రక్షాళన కోసం దశాబ్దాలుగా సీపీఎం పోరాటాలు చేస్తుందని లేఖలో వివరించారు.

ఇక్కడ అమ్మాయి... అక్కడ అబ్బాయి

- జర్మన్ యువకుడితో తెలంగాణ యువతి వివాహం
- నల్లగొండ జిల్లా కేంద్రంలో ఒక్కటైన జంట



నవ దంపతులు కట్ట అనిత, క్రిష్

నార్కట్‌పల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మంగళ వాయిద్యాలు. బ్రాహ్మణుల ఆశీర్వచనాల నడుమ అచ్చ తెలుగు సంప్రదాయంలో జరిగిన వివాహంతో తెలుగు అమ్మాయి..జర్మనీ అబ్బాయి ఒక్కట య్యారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన కట్ట నర్సింహ్మా- పూలమ్మ దంపతులది వ్యవసాయ కుటుంబం కా గా, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో చిన్న కుమార్తె కట్ట అనిత స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలోనే పదో తరగతి వరకు చదువుకుంది. ఇంటర్‌ను నల్లగొండలోనే అభ్యసిం చిన అనిత హైదరాబాద్‌లో బీ.టెక్ పూర్తిచేసింది. ఉన్నత చదువుల నిమిత్తం 2017లో జర్మనీకి వెళ్లి అక్కడే ఎంఎస్సీ పూర్తి చేసింది. జర్మనీ దేశంలో ప్రముఖ కార్పొరేట్ సంస్థలో అకౌంటెంట్‌గా ఉద్యో గం చేస్తుంది. మరొక కార్పొరేట్ కంపెనీలో అకౌంటెంట్‌గానే పని చేస్తున్న జర్మనీకి చెందిన క్రిష్ అనే యువకునితో పరిచయం ఏర్పడింది. దీంతో వీరిద్దరు ఇష్టపడి పెళ్లి చేసుకుందామనుకుని నిర్ణయి చుంచుకుని తమ నిర్ణయాన్ని ఇరు కుటుంబాల పెద్దలకు తెలియ జేశారు. ఇరు వురి కుటుంబ సభ్యుల అంగీకారంతో హిందూ సంప్ర దాయ పద్ధతి లో గురువారం నల్లగొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరి గిన కల్యాణ వేదికపై వీరిద్దరూ భార్యాభర్తలయ్యారు. పలువురు ఆశీర్వదించారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జట్ల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనా మహిళల జట్టు

నల్లగొండ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హన్మకొండ పట్టణంలోని జేఎన్ఎస్ మైదానంలో ఈనెల 8 నుంచి 10 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లా 70వ సీనియర్ పురుషుల, మహిళల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్లను ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్లను అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.బయ్యన్న, రాష్ట్రకార్యదర్శి స్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాస్ గురువారం ప్రకటిం చారు. ఎంపికైన వారిలో పురుషుల విభాగంలో ఆలీంహసన్, జంగయ్య నరేష్, దేవేందర్, నాగరాజు, గణేష్, శ్రీను, సందీప్, గిరి, మనోజు, ఏ. ప్రమోద్ కుమార్, మహిళల విభాగంలో చందన, శ్వేత, హాలీనా, భవ్యశ్రీ, ఏకాంబాశ్వేరి, శృతి, శ్రీజ, జోత్స్న, సంజన, సాత్విక ఉన్నారు.

హాకీ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు ద్వితీయ స్థానం

నార్కట్‌పల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టుకు ద్వితీయ స్థానం దక్కిందని హాకీ కోచ్ మేనేజర్లు ఎండీ యావర్, ఇమామ్ కరీం తెలి పారు. 68వ జాతీయ ఎస్‌జీఎఫ్‌లో భాగంగా సంగారెడ్డిలో జరిగిన పోటీల్లో లీగ్, నాకౌట్‌లో అద్భుత ప్రతిభ కనబర్చి ఆదిలాబాద్ జటు తో తలపడింది. 2-1 గోల్స్‌తో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు వారు తెలిపారు. దీంతో ఉమ్మడి జిల్లా జట్టు జాతీయ హాకీ పోటీలకు అర్హత సాధించింది. కాగా జాతీయ స్థాయిలో పాల్గొనే రాష్ట్ర జట్టులో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు విగ్నేశ్, మహమ్మద్‌మాజ్, వినయ్‌లకు స్థానం దక్కింది.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు సాయి శంకర్



సాయిశంకర్‌కు అభినందన

మోత్కూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వాలీబాల్ అండర్-19 విభాగంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి గంగుల సాయిశంకర్ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ప్రభజస్టిస్ తెలిపారు. క్రీడాకారుల ఎంపిక కోసం ఈనెల 6న భువనగిరిలో నిర్వహించిన పోటీల్లో సాయి శంకర్ యాదాద్రిభువనగిరి జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు.

స్వర్ణతాపడం తర్వాత మహాకుంభాభిషేకం

● సమీక్ష సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

యాదాద్రి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి విమాన గోపురానికి బంగారు తాపడం పనులు పూర్తయిన తర్వాత మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్టు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దర్శించుకోనున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో దేవాదాయ, వైటీడీఏ అధికారులతో మంత్రి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణంతో పాటు భూసేకరణ, నష్టపరిహారం, అభివృద్ధి పనులపై మాట్లాడారు. దేశంలోనే మొట్టమొదటి ఎత్తైన స్వర్ణగోపురం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిదే కావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వ కారణమని మంత్రి అన్నారు. 2025 మార్చి 1వ తేదీ నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు ఉన్నాయని, ఈ లోపే విమానగోపురానికి స్వర్ణతాపడం పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రి నేతృత్వంలో స్వామివారి చెంతన మహాకుంభాభిషేకం అనంతరం బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామన్నారు. శుక్రవారం జరిగే సమీక్ష సమావేశంలో యాదగిరిగుట్ట దేవాలయం అభివృద్ధి పనులపై సమగ్ర నివేదికను ముఖ్యమంత్రి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 10వేల చదరపు అడుగుల బంగారు తాపడం పనులకు ఇప్పటి వరకు 1600 చదరపు అడుగులు పూర్తి చేసినట్లు తెలిపారు. నవంబరు 15వ తేదీ నుంచి బంగారు తాపడం అమర్చే పనులు ప్రారంభమవుతాయని, మొత్తం 60కిలోల బంగారం, గోల్డ్ ప్లేటింగ్‌తయారీ, ఫిక్సింగ్‌చార్జీలకు మొత్తం రూ.8కోట్లు వెచ్చిస్తున్నట్టు తెలిపారు. గాలిగోపురం విస్తరణంలో భాగంగా ఇళ్లు కోల్పోయిన వారికి పరిహా రంలో భాగంగా అందించనున్న ప్రయోజనాలపై ఆరా తీశారు. వీరిలో 162 మందికి అంచనున్న దుకాణాల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

● సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి డాక్టర్ అలగు వర్షిణి

బీబీనగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రాణాంతకంగా మారిన క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి డాక్టర్ అలగు వర్షిణి సూచించారు. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ శివారులోని సైనిక శిక్షణ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని జూమ్ ద్వారా ప్రారంభించారు. క్యాన్సర్ రావడానికి కారణాలు, లక్షణాలు, నివారణ, చికిత్స పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అంకాలజిస్టు డాక్టర్ చినబాబు డానియల్ జూమ్ మీటింగ్ ద్వారా క్యాన్సర్ రకాలు, రేడియో థెరపీ లక్షణాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లంగ్స్, బ్రెస్టు, నోటి, గర్భాశయ, కడుపు, అన్న వాహిక తదితర క్యాన్సర్ రకాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముందస్తు నివారణ టెస్టుల ద్వారా మొదటి దశలోనే క్యాన్సర్‌ను గుర్తించి ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిరూప పాల్గొన్నారు.

కులగణన దేశానికి రోల్ మోడల్ కావాలి

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

చౌటుప్పల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో చేపడుతున్న కులగణన దేశానికి రోల్ మోడల్ కావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహిస్తున్న కులగణన సర్వేను స్వాగతిస్తున్నామన్నారు. కులాల వారిగా డేటా లేకపోతే బీసీలకు కోటా దక్కదని పేర్కొన్నారు. బీసీ కులగణన జరగకుండా బీజేపీ నాయకులు కుట్రలు చేస్తు న్నారని ఆరోపించారు. కులగణనపై టీఆర్ఎస్ నాయకుడు కేసీఆర్, బీజేపీ నాయ కుడు కిషన్‌రెడ్డిల వైఖరి ఏమిటో స్పష్టంగా వెల్లడించాలన్నారు. కుల గణన దేనికోసమని బీజేపీ నాయకులు డీకే అరుణ, రాజాసింగ్, బండి సంజయ్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అడుగుతున్నారని, కులగణన దేని కోసమో వారికి తెలియదా? అని ప్రశ్నించారు. పూటకో పార్టీ మార్చే మహేశ్వర్‌రెడ్డి కులగణ గురించి మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఇప్పటికైనా కుల గణనపై వైఖరి చెప్పాలని, లేనిపక్షంలో ఎన్నికల సమయంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కులగణన బీసీల ఆకాంక్ష అని తెలిపారు. కొంతమంది బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. సమావేశంలో చౌటుప్పల్ మాజీ ఎంపీపీ బొంగు జంగయ్యగౌడ్, బీసీ యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు వీరమల్ల కార్తీక్, నాయకులు సిలివేరు శ్రీనివాస్, వెంకటేశం, సతీష్ నరేష్ భరత్ సాయి, నవీన్ పవన్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు చేస్తేనే వెళ్తాం

● తేమ శాతం ఎక్కువ ఉందని కొనుగోళ్లు నిలిపివేసిన అధికారులు ● మర్రిగూడ మండలం సరంపేట, ఎరుగండ్లపల్లిలో రైతుల రాస్తారోకో


మర్రిగూడ : సరంపేట గ్రామంలో రాస్తారోకో చేస్తున్న రైతులు


చింతపల్లి : ఘడియగౌరారంలో రాస్తారోకో చేస్తున్న రైతులు

మర్రిగూడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు చేసే వరకు ఆందోళన విరమించేది లేదని రైతులు స్పష్టం చేశారు. రైతులు తెచ్చిన పత్తిలో తేమశాతం ఎక్కువగా ఉందని నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని సరంపేట, ఎరుగండ్లపల్లి గ్రామంలోని హరిహర, లక్ష్మీనర్సింహ్మా పత్తి మిల్లుల్లోని కేంద్రాల్లో అధికారులు, మిల్లర్ల యజమానులు పత్తి కొనుగోళ్లను నిలిపివేశారు. దీంతో ఆగ్రహించిన రైతులు ఆయా పత్తి కొనుగోలు కేంద్రాల ఎదుట గురువారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పత్తిలో తేమశాతం ఎక్కువగా ఉందని తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ కేంద్ర బయ్యర్లు, మిల్లర్ల యజమానులు కుమ్మక్కై పత్తిలో తేమశాతం ఎక్కువగా ఉందని కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. పత్తి కొనుగోలు చేసేంత వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించి కూర్చున్నారు. రెండు రోజుల నుంచి 20శాతం తేమ ఉన్నా పత్తి మిల్లర్లు కొనుగోలు చేశారని, ఇప్పుడు 12శాతం ఉంటేనే పత్తి కొనుగోలు చేస్తామనడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ రంగారెడ్డి రైతుల వద్దకు వచ్చి వారితో మాట్లాడారు. మిల్లర్లు 12శాతం ఉంటేనే పత్తి కొనుగోలు చేస్తామని చెబుతున్నారని, 20శాతం తేమ ఉన్న పత్తి కొనుగోలు చేశారని రైతులు అధికారులకు చెప్పారు. దీంతో తహసీల్దార్ స్పందించి మిల్లర్లకు, రైతులకు నచ్చజెప్పి పత్తి కొనుగోలు చేసే విధంగా ఏర్పాటు చేయడంతో రైతులు ఆందోళన విరమించారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఇతర జిల్లాల పత్తి కొనుగోలు చేస్తున్నారు

చింతపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని ఘడియగౌరారం విష్ణుసాయి పత్తి మిల్లు వద్ద రైతులు గురువారం పెద్దఎత్తున ఆందోళన చేశారు. మిల్లుల నిర్వాహకులతో అధికారులు కుమ్మక్కై ఇతర జిల్లాల నుంచి వచ్చిన పత్తి కొనుగోలు చేసుకుంటున్నారని ఆరోపించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో గ్రామాల్లోని రైతులు తెచ్చిన పత్తిని పక్కకు పెట్టి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లా నుంచి లారీల్లో తెచ్చిన పత్తి కొనుగోలు చేస్తున్నారు. తేమ శాతం 15వరకు పెంచి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వాహనాలు ఒక్కసారిగా నిలిచిపోవడంతో ట్రాఫిక్ ఇబ్బంది కలిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు వచ్చి వారికి నచ్చ చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

16మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు

నల్లగొండ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రంలో గురువారం రాత్రి పోలీసులు నల్లగొండ డీఎస్పీ కొలను శివారాంరెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండ వన్‌టౌన్, టూటౌన్‌తో పాటు స్పెషల్ పోలీసులు స్నిపర్ డాగ్‌తో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న 29మందిపై పిట్టీ కేసులు, 16మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు, సరైన పత్రాలు లేని 14వాహనాలను సీజ్ చేశారు.

గుండ్లపల్లిలో కొండ చిలువ హతం

మఠంపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం గుండ్లపల్లి గ్రామస్థుల చేతుల్లో కొండచిలువ హతమైంది. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి కొండచిలువ బుధవారం రాత్రి కూరపాటి రవి ఇంట్లో చొరబడింది. గమనించిన కుటుంబసభ్యులు కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వచ్చి కొండచిలువను హతమార్చారు. కొండచిలువ మీటరున్నర పొడవు ఉందని గ్రామస్థులు తెలిపారు.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.150	240	270
సూర్యాపేట	రూ.150	220	250
నల్లగొండ	రూ.150	220	250

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	586.20
టీఎంసీలు	301.3570
ఎడమకాల్వకు నీటి విడుదల	4,613
కుడికాల్వకు	6,253
విద్యుత్ కేంద్రం ద్వారా	29,151
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	64,356 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	42,356 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.90 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	8,675 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	16,000క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.10
ప్రస్తుత నీటి మట్టం	643.60 అడుగులు
టీఎంసీలు	4.10
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	455.27 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	455.27 క్యూసెక్కులు

అయ్యప్పమాల వేసుకునేందుకు వచ్చి..


దేవరకొండలో రాస్తారోకో చేస్తున్న శేఖరచారి కుటుంబసభ్యులు



దేవరకొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి మాల వేసుకునేందుకు వచ్చిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో జరిగింది. దేవరకొండ సీఐ నర్సింహులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండకు చెందిన అలివేలుతో నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తికి చెందిన ఆవాంచ శేఖరచారి(46)కి వివాహమైంది. ఆ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. శేఖరచారి దేవరకొండలో అయ్యప్పమాల వేసుకునేందుకు పెద్ద కుమారుడు జగదీష్‌తో కలిసి ఈ నెల 6న ద్విచక్ర వాహనంపై దేవరకొండలోని అయ్యప్పస్వామి దేవాలయానికి బయలుదేరాడు. దేవాలయం సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి వస్తున్న బొలేరో వాహనం ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో శేఖరచారికి తీవ్ర గాయాలయ్యాయి. జగదీష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన శేఖరచారిని మొదట దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శేఖరచారి గురువారం మృతిచెందాడు. అక్కడి నుంచి మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శేఖరచారి మృతికి కారణమైన బొలేరో వాహన యజమానిపై చర్య తీసుకొని న్యాయం చేయాలని మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట గురువారం సాయంత్రం అర్ధగంటపాటు ధర్నా, రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బంధువులు ఆందోళన విరమి ంచారు. భార్య అలివేలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

చిట్యాలరూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. చిట్యాల ఎస్ఐ ఎన్. ధర్మ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపునకు బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి కాలినడకన వెళ్తుండగా.. పెద్దకాపర్తి శివారులో హైదరాబాద్ వైపునకు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆ వ్యక్తికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు 40-45 సంవత్సరాల మధ్య ఉంటుందని, పెద్దకాపర్తి పంచాయతీ కార్యదర్శి కంచర్ల గౌతమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా..


ఎగ్గె నవీన్(ఫైల్)

వలిగొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని టేకులసోమారం గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన ఎగ్గె నవీన్(24) భువనగిరిలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై బుధవారం రాత్రి స్వగ్రామానికి వస్తుండగా టేకులసోమారం గ్రామం వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. దీంతో నవీన్ అక్కడికక్కడే మృతిచెందాడు. నవీన్ తండ్రి మల్లేష్ ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు

యువతి కళ్లలో కారం చల్లి కిడ్నాప్

● నల్లగొండ జిల్లా కేంద్రంలో ఘటన

నల్లగొండ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మనుమరాలు ప్రేమ పెళ్లి చేసుకుందనే కోపంతో తాతయ్య, నాయనమ్మ ఆమె కళ్లలో కారం చల్లి బలవంతంగా కారులో తీసుకువెళ్లారు. గురువారం సాయంత్రం నల్లగొండ జిల్లాకేంద్రంలో ఈ సంఘటన జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ నాగరాజు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దవూర మండల పరిధిలోని గర్నెకుంట గ్రామానికి చెందిన భూతం హరిప్రసాద్(ఎస్సీ), నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన కొడిదల రాజేశ్వరి(బీసీ)లకు నల్లగొండలోని ఓ కంప్యూటర్ సెంటర్ క్లాసు వద్ద పరిచయం ఏర్పడింది. నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్న వీరిద్దరూ గత నెల 23వ తేదీన పెద్ద మనుషులు, కేవీపీఎస్ సంఘం ఆధ్వర్యంలో ఆదర్శ వివాహం చేసుకున్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో హరిప్రసాద్‌కు సంబంధించిన డిగ్రీ, ఇతర సర్టిఫికెట్లు ఉండడంతో తీసుకుని వెళ్లేందుకు భార్య రాజేశ్వరితో కలిసి వచ్చాడు. సమాచారం తెలుసుకున్న రాజేశ్వరి తాతయ్య ఇద్దయ్య, నాయనమ్మ దశరథమ్మ, మరో ఇద్దరు కలిసి అక్కడికి చేరుకుని హరిప్రసాద్, రాజేశ్వరి కళ్లలో కారం చల్లి రాజేశ్వరిని బలవంతంగా కారులో తీసుకెళ్లారు. బాధితుడు హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఇద్దయ్య, నాయనమ్మ దశరథమ్మ, మరో ఇద్దరిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి విచారిస్తున్నారు.

దాడి ఘటనలో భార్యాభర్తలకు జైలుశిక్ష

చిట్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇతరులపై దాడి చేసిన ఘటనలో భార్యభర్తలకు తొమ్మిది నెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ నల్లగొండ సెషన్స్ కోర్టు తీర్పు గురువారం వెలువరించింది. చిట్యాల ఎస్ఐ ధర్మా తెలిపిన వివరాలిల ప్రకారం... 2021లో నల్లగొండ జిల్లా చిట్యాల మండలం నేరడ గ్రామానికి చెందిన భార్యభర్తలు రూపని అంజనేయులు, రూపని జానకి అదే గ్రామానికి చెందిన దాయాది రూపని శంకర్‌పై దాడి చేయగా, అప్పటి ఎస్ఐ నాగరాజు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాగా గురువారం కోర్టు వారిద్దరికి శిక్ష విధిస్తూ తీర్పు వెలువడించింది. కేసుకు సంబంధించి కోర్టు కానిస్టేబుల్ ముత్తిలింగంను సీఐ నాగరాజు, ఎస్ఐ ధర్మా అభినందించారు.

మాదాపూర్‌లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

● ఉమ్మడి పది జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారులు ● జ్యోతిప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న


రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న


తలపడుతున్న క్రీడాకారులు

తుర్కపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని మాదాపూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో 68వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. తీన్మార్ మల్లన్న సహకారంతో అండర్-17 బాలుర విభాగం, అండర్- 14 బాల, బాలికల విభాగాలకు చెందిన క్రీడాకారులు ఉమ్మడి పది జిల్లాల నుంచి పది జట్లు, అండర్- 14 బాల, బాలికల విభాగంలో 20 జట్లు పాల్గొన్నాయి. 360మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణంలో ఫ్లడ్‌లైట్ల వెలుగులతో నాలుగు కబడ్డీ కోర్టు(గ్రౌండ్)లు ఏర్పాటు చేసి పగలు, రాత్రి వేళలో ఈ క్రీడలకు సంబంధించి మొదటి రోజు లీగ్ పోటీలు నిర్వహించారు. ఈ నెల 9వ తేదీ వరకు పోటీలు నిర్వహించనున్నారు.

కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలు అభివృద్ధి జరగాలి : తీన్మార్ మల్లన్న

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి జరగాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అక్కడ ఫోర్త్‌సిటీ తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నారని, తనకు మాత్రం ఇక్కడికి ఫోర్త్ సిటీని తీసుకురావాలని ఉందన్నారు. మూసీ ప్రక్షాళన కోసం సీఎం రేవంత్‌రెడ్డి వెళ్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలను ప్రక్షాళన చేయాలనేది తన కల అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించేందుకే ఈ క్రీడలను ఏర్పాటు చేశామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం మాదాపూర్ ప్రభుత్వం పాఠశాలలో నో అడ్మిషన్ బోర్డు పెట్టే స్థాయికి పాఠశాలలకు తీసుకురావాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డికి పిల్లలతో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోటీలు ప్రారంభానికి ముందు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న జాతీయ జెండావిష్కరణ చేయగా, క్రీడాకారులు ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో డీఈవో కే.సత్యనారాయణ, ఎస్‌జీఎఫ్ స్టేట్ సెక్రటరీ కుంభం రాంరెడ్డి, స్టేట్ స్పోర్ట్స్ కో-స్పాన్సర్ వడ్డె జానయ్య, ఎంఈవో మాలతి, ఎంపీడీఓ రూపాసీలక్ష్మీబాయి. ఎస్ఐ తక్యుద్దీన్, పాఠశాల క్రీడల సమాఖ్య (ఎస్‌జీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బెజ్జం బాలకృష్ణ, ఆర్గనైజింగ్ క్రీడల ఆర్గనైజర్ చింతపండు వెంకటేశ్వర్లు, కన్వీనర్ లింగంపల్లి విజయ్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ భాగ్యమ్మ ఉన్నారు.

మోత్కూరు కాంగ్రెస్‌లో రచ్చకెక్కిన వర్గపోరు

● పాత, కొత్త నేతల మధ్య కుదరని సఖ్యత ● ఎమ్మెల్యే సామేలు కార్యక్రమానికి ముందు వాదులాడుకున్న నేతలు ● ఒకరిపై ఒకరు దూషణల పర్వం


వాదులాడుకుంటున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్వర్లు

మోత్కూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలో పాత, కొత్త కాంగ్రెస్ నేతల మధ్య పొసగడం లేదు. నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గ విభేదాలు గురువారం ఒక్కసారిగా భగ్గుమ న్నాయి. ఇందిరమ్మ కమటీల ఏర్పాటు సందర్భంగా మోత్కూరు మండలంలో పాత, కొత్త కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలు నెలకొనడం, పార్టీలోకి కొత్తగా వచ్చిన నాయకులు తమను సంప్రదించకుండా ఏకపక్షంగా ఇందిరమ్మ కమిటీలు వేస్తున్నారని పాత కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యే సామేలుకు ఫిర్యాదు చేశారు. మోత్కూరు రహదారి బంగ్లాకు మరమ్మతులు చేసిన నేపథ్యంలో దానిని ప్రారంభించడానికి ఎమ్మెల్యే సామేలు వస్తున్న సందర్భంగా గురువారం కాంగ్రెస్ నాయకులు అక్కడ గుమికూడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ(పాతనాయకుడు) కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారే పార్టీలో పెత్తనం చెలాయిస్తున్నారని, పదేళ్ల గత ప్రభుత్వ నిర్బంధాలను తట్టుకుని, పార్టీని కాపాడుకున్న నాయకులను పట్టించుకోవడం లేదని, ఇలా అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ఎలా గెలుస్తుందన్నారు. పక్కనే ఉన్న పాత కాంగ్రెస్ నాయకుడు పన్నాల శ్రీనివాస్‌రెడ్డి అలా అనొద్దు, పార్టీలో ఉంటూ పార్టీని ఎందుకు చులకన చేస్తారన్నారు. పనికిరాని వారంతా రావడంతోనే పార్టీ చెడిపోయిందని, పార్టీలోకి వచ్చాక కూడా పార్టీ కార్యకర్తలకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని వంగాల సత్యనారాయణ వ్యాఖ్యానించారు. ఎవరిని అంటున్నావంటూ సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు(కొత్తనాయకుడు), కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వంగాల సత్యనారాయణను ప్రశ్నించారు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఒకరినొకరు దూషించుకున్నారు. కార్యకర్తలు వారిని ఆపే ప్రయత్నం చేసినా వారు ఆగకుండా పరస్పరం దూషించుకొని, ఆరోపణలు చేసుకున్నారు. కొద్ది సేపటి తర్వాత ఎమ్మెల్యే సామేల్ అక్కడకు రావడంతో వాదులాడుకుంటున్న నేతలంతా సర్దుమణిగారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్ర వైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించి ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాల యంలో స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి. కార్తీక మాసం సందర్భంగా శివాలయంలో శ్రీపర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.18,95,797ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

విమాన గోపురానికి కళావరోహణ

లక్ష్మీనృసింహుడి ఆలయ విమాన గోపురానికి బంగారు తాపడం పనుల నిర్వహణకు ముందుగా అర్చకులు బుధవారం కళావరోహణ మహా క్రతువును నిర్వహించారు. ఆలయంపైన సుదర్శన చక్రానికి నవ కలశ స్నపనం అనంతరం పూలమాలలు వేసి గోపురం ఆవాహిత దేవతలందరినీ కలశంలో ఆవాహన చేశారు.

కొను 'ఫెల్లు'

● పంట విక్రయించేందుకు అన్నదాత అగచాట్లు ● సన్నధాన్యం కొనని మిల్లర్లు ● తగ్గుతున్న ధాన్యం ధరలు ● ఆందోళనలో రైతులు



మిర్యాలగూడలోని ఓ మిల్లులో ధాన్యం ట్రాక్టర్లు

మిర్యాలగూడ, మిర్యాలగూడరూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి ధాన్యాన్ని విక్రయించేందుకు అన్నదాత అగచాట్లు పడుతున్నారు. మిల్లర్లు సిండికేట్‌గా మారి ధరలో కోత విధిస్తున్నారు. గురువారం మండలంలోని యాద్గార్‌పల్లి, గూడూరు, తుంగపాడు గ్రామాలతో పాటు పట్టణంలోని పలు మిల్లులకు రైతులు ధాన్యాన్ని భారీగా తీసుకువచ్చారు. దీనిని అదనుగా భావించిన మిల్లర్లు క్వింటాకు రూ.2300 నుంచి రూ.2350 వరకు మాత్రమే కొనుగోలు చేపడుతుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాగర్ ఎడమకాల్వ ఆయకట్టు పరిధిలో వరిసాగుకు ఆయువు పట్టుగా ఉన్న మిర్యాలగూడ పరిధిలో వరికి ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుంది. ఈ సీజన్‌లో వాతావరణంలో నెలకొన్న మార్పులతో వ్యవసాయం కొంత భారంగా మారిందని రైతులు పేర్కొంటున్నారు. వరి సాగు చేపట్టేందుకు సిద్ధమైన రైతులకు సీజన్ ప్రారంభంలో ప్రకృతి సహకరించడంతో బోరుబావుల ఆధారంగా ఉన్న రైతులు మాత్రమే వరి సాగుకు చేపట్టారు. దీంతో సాగర్ ఆయకట్టులో ఆలస్యంగా వరి నాట్లు వేశారు. ఈ సందర్భంలో వరి నాట్ల నుంచి వివిధ రకాల తెగుళ్ల నివారణకు చేపట్టిన మందుల పిచికారీ, వ్యయం రైతన్నకు ఆర్థిక భారంగా మారింది. అదనంగా ఇటీవల కురిసిన వర్షాలు, గాలివానకు పంట నేలమట్టమై మరికొంత నష్టం వాటిల్లింది.

ధాన్యం ధరల్లో కోత

అష్టకష్టాలు ఎదుర్కొని వరి సాగు చేపట్టిన రైతులను దోచుకునేందుకు వ్యాపారులు సిద్ధమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని రైతులు అధికంగా మిర్యాలగూడ పరిధిలోని రైస్‌మిల్లులకు ధాన్యం తరలించి విక్రయిస్తుంటారు. ఈ సందర్భంలో ధాన్యం కొనుగోలు చేపట్టే ప్రక్రియలో మిల్లర్లు సిండికేట్‌గా మారి ధాన్యం కొనుగోలు చేపడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధాన్యం కొనుగోళ్ల ప్రారంభ దశలో రెట్టింపు స్థాయిలో ధరలు నిర్ణయించి కోతలు ఊపందుకొని ధాన్యం అధికంగా మిల్లులకు వచ్చే సమయంలో కొంతమంది మిల్లర్లు మాత్రమే కొనుగోలు చేపడుతూ మిగతా వారు నామ మాత్రంగా కొనుగోలు చేపట్టేలా వ్యవహరిస్తున్న తీరు పై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర ఏ- గ్రేడ్ ధాన్యానికి రూ. 2320, సాధారణ రకం ధాన్యానికి రూ.2300 కల్పిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. దీంతో మిల్లులను ఆశ్రయిస్తున్నారు. దీంతో తీసుకువచ్చిన ధాన్యాన్ని తిరిగి తీసుకెళ్లలేక వ్యాపారులు నిర్ణయించిన ధరకే ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తుంది. మిల్లుల వద్ద ధాన్యం నాణ్యతను పరిశీలించేందుకు మాయిశ్చరైజింగ్ మిషన్లు ఉపయోగించాలని అధికారులు హెచ్చరిస్తున్నా మిల్లర్లు పట్టించుకోవడం లేదు. మ్యానువల్‌గా ధాన్యం నాణ్యతను పరిశీలిస్తూ అడ్డగోలు ధరలు నిర్ణయిస్తూ రైతులను దోచుకుంటున్నారు.

సన్నధాన్యం కొనుగోళ్లు చేయని మిల్లర్లు

గతంలో ఎక్కువగా 1010 దొడ్డు రకం వరి పండించిన రైతులు మిల్లర్లు కొనుగోలు చేయకపోవడంతో సాగర్ ఆయకట్టులో ఆ రకం వరి సాగును రైతులు దాదాపు నిలిపివేశారు. ప్రభుత్వం ఈ సారి సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించడంతో రైతులు సన్నాల సాగుకే మొగ్గు చూపారు. రబీలో 80 శాతం రైతులు మహింద్ర చింట్ల రకాలను సాగు చేశారు. ధాన్యం అమ్ముకోవడానికి ట్రాక్టర్లపై మిల్లు వద్దకు తేగా కొనుగోలు చేయమని మిల్లర్లు మొండికేయడంతో హతాశులవుతున్నారు. ఏదో ఓ రేటుకు కొనుగోలు చేయాలని రైతులు మిల్లర్లను ప్రాధేయపడుతున్నట్లు సమాచారం. స్థానిక నేతల, అధికారులతో రైతులు మొరపెట్టుకోగా వారి ఒత్తిడి మేరకు అరకొరగా కొనుగోలు చేస్తున్న మిల్లర్లు మద్దతు ధరకంటే రూ.150-200 తక్కువ కొనుగోలు చేస్తున్నట్లు వాపోతున్నారు. అంతేకాక కొన్ని రకాల సన్నధాన్యం కొనుగోలు చేయమని మిల్లర్లు పేచీ పెడుతుండటంతో సన్నాలకు మద్దతు ధర లభించని పరిస్థితి. రైస్ మిల్లుల వద్ద గతేడాది అధిక ధర పలికిన మహీంద్ర, 101, కావేరి, జేఎస్ఆర్, హెచ్ఎంటీ రకం సన్నధాన్యాన్ని రైతులు సాగు చేశారు. వీటిలో కొన్ని రకాలను మిల్లర్లు కొనుగోలు చేసేందుకు సుముఖత చూపడం లేదు. మద్దతు ధర కంటే తక్కువగా కొనుగోలు చేసేందుకు మిల్లర్లు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వరి కోతలు ఈ సమయంలో ఒకేసారి చేపడుతుండటంతో ధాన్యం మిర్యాలగూడ పరిధిలోని రైస్‌మిల్లులకు భారీ స్థాయిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి తరలివస్తుంది.

పెట్టుబడులకు అనుగుణంగా ధర కల్పించాలి



ఈ ఏడాది వరిసాగు కష్టంగా మారింది. పెట్టుబడులు అధికంగా పెట్టాల్సి వచ్చింది. గాలివానలు రావడంతో కొంతమేర పంట నష్టం జరిగింది. దీనికి తోడు ధాన్యం ధరలు తగ్గడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. పెట్టుబడులకు అనుగుణంగా ధాన్యానికి ధర కల్పించి రైతులను ఆదుకోవాలి.

● రవితేజ, రైతు, మిర్యాలగూడ

కస్టమర్లు బియ్యం వాపస్ ఇస్తున్నారు



మహీంద్ర చింట్ల రకం రైస్ కొనుగోలు చేసిన కస్టమర్లు తిరిగి వాపస్ ఇస్తున్నారు. బియ్యంలో పిండి పదార్థం ఎక్కువగా ఉండి ఉడికించడంతోనే మొత్తబడుతోంది. యాసంగి రైతుల వద్ద కొనుగోలు చేసిన బియ్యం 50శాతం మిల్లర్ల వద్దే ఉంది. గత సీజన్‌లో కొన్న మిల్లర్లు చాలా వరకు నష్టపోవాల్సి వచ్చింది. అందుకే ఆ రకం ధాన్యాన్ని కొనుగోలు చేయలేమని చెబుతున్నాం.

గౌరు శ్రీనివాస్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఊపందుకున్న ధాన్యం కొనుగోళ్లు

కేతేపల్లి: కేతేపల్లి మండలంలోని ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. మండలంలోని 16 గ్రామాలకుగాను ఐకేపీ ఆధ్వర్యంలో 4, పీఏసీఎస్ 7, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 2 చొప్పున మొత్తం 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిల్లోకా ననగోడు కేంద్రాన్ని ప్రత్యేకంగా సన్న రకం ధాన్యం కొనుగోలుకు కేటాయించారు. ఐదారు రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రైతులు తమ ధాన్యం మొత్తం కొనుగోలు కేంద్రాల్లోనే పోస్తున్నారు. ఒకట్రెండు రోజులు ఆరబెట్టగానే నిర్దేశిత తేమశాతం వస్తుండటంతో కేంద్రాల నిర్వాహకులు ధాన్యం కాంటాలు నిర్వహించి మిల్లులు, గోదాంలకు తరలిస్తున్నారు. మండలంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఇప్పటి వరకు 10,152 క్వింటాళ్ల ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు చేసి రవాణా చేశారు. ఇంకా దాదాపు 13400 వేల క్వింటాళ్ల ధాన్యం రాశులుగా పోశారు.



ఎంపికైన క్రీడాకారులతో మురళిగౌడ్

ఖోఖో పోటీల్లో రాణించాలి

కనగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో రాణించి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని కాంగ్రెస్ యువజన నాయకుడు నర్సింగ్ మురళిగౌడ్ అన్నారు. అండర్-19 విభాగంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా తరపున రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. గురువారం ఇండోర్ స్టేడియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేసిన ఉపాధ్యాయులను ప్రశంసించారు. కార్యక్రమంలో యు-19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఇందిర, పీడీలు కె.నర్సిరెడ్డి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సర్వే స్టిక్కర్లు

● జిల్లాలో కొనసాగుతున్న కులగణన



కొండమల్లేపల్లి: సర్వే వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో

ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే రెండో రోజు గురువారం జిల్లాలో నిర్వహించారు. ఎన్యూమరేటర్లకు కేటాయించిన సర్వే పరిధిలో కుటుంబాల వారి పేర్లు నమోదు చేస్తూ వారికి సంబంధించిన ఇంటి నెంబర్, కుటుంబ యజమాని పేరుతో కూడిన ఇళ్ల జాబితాను తయారు చేసి స్టిక్కర్లు వేస్తున్నారు. సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ ఎన్యుమరేటర్లకు సహకరించాలని అధికారులు కోరారు. ఇంట్లో యజమాని పేరుతో పాటు కుటుంబ సభ్యుల వివరాల ఆధారంగా ఇంటి డోరుపై స్టిక్కర్ వేసే ప్రక్రియ నిర్వహిస్తున్నారు. సర్వే కోసం అతికించిన స్టిక్కర్లను, వాటిపై నమోదు చేసిన ఇంటి నెంబర్, ఎన్యూమరేషన్ బ్లాక్ తదితర వివరాలను అధికారులు తనిఖీ చేశారు. ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా సర్వే చేయాలని అధికారులు సూచించారు. ఒకే ఇంట్లో ఇద్దరు లేక ముగ్గురు అన్నదమ్ములు ఉంటే వేర్వేరుగా ఉంటే ప్రత్యేకంగా నమోదు చేయాలని సూచించారు. ఖాళీగా ఉన్న గృహాలకు వేకెంట్ అనే స్టిక్కర్ తప్పనిసరిగా వేయాలని సూచించారు.

● దేవరకొండ పట్టణంలో ఎన్యూమరేటర్లు చేస్తున్న సర్వేను మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట మునిసిపల్ అధికారులు ఉన్నారు.

● శాలిగౌరారం మండలంలోని భైరవునిబండలో సమగ్ర కుటుంబ సర్వేను తహసీల్దార్ పి.యాదగిరి, ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి పరిశీలించారు.

● కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఇంటింటికి స్టిక్కర్లు వేసే ప్రక్రియ కొనసాగుతుంది. ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే నిర్వహణకు ముందస్తుగా గ్రామాల్లోని బ్లాకుల వారీగా నివాస గృహాల గుర్తింపునకు ఇంటింటికి స్టిక్కర్లు అంటిస్తున్నారు. మండలంలోని 16 గ్రామపంచాయతీలకు చెందిన 88 బ్లాకుల్లో దాదాపు 13,200 గృహాలు ఉండగా తొలిరోజు బుధవారం 4,856 గృహాలకు, గురువారం మరో 5,245 గృహాలకు స్టిక్కర్లు వేశారు.



దేవరకొండలో కుటుంబ సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు, అధికారులు

● చింతపల్లిలో స్టిక్కర్లు వేసే కార్యక్రమాన్ని ఎంపీడీవో సుజాత పరిశీలించారు. 9వ తేదీ నుంచి కులగణన చేపట్టనున్నట్లుతెలిపారు.

● కట్టంగూరులో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి(సీపీవో) వెం కటేశ్వర్లు మాట్లాడుతూ ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎం పీడీవో జ్ఞానప్రకాష్‌రావు, ఆర్ఐ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి మండల కేంద్రంలో నల్లగొండ రోడ్డులోని పాత ఊరు, చిన్నఅడిశర్లపల్లి గ్రామాల్లో కుటుంబ సర్వే నిర్వహిస్తున్న తీరును ఆర్డీవో రమణారెడ్డి పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎండి.అన్వర్ హుస్సేన్, ఎంపీడీవో బాలరాజురెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

● కనగల్ మండలంలోని కుమ్మరిగూడెం, అమ్మగూడెం, కనగల్ గ్రామాల్లో చేపడుతున్న సమగ్ర సర్వేను తహసీల్దార్ పద్మ పరిశీలించారు. పకడ్బందీగా సర్వే చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ పార్వతమ్మ, ఏఆర్ఐ యాదగిరి పాల్గొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఫణికుమార్

నల్లగొండటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీపీఆర్టీయూ కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్, ప్రధాన కార్యదర్శి జానారెడ్డి, గౌరవాధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాసులు, ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు సుంకరి భిక్షంగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోనే అతిపెద్ద ఉపాధ్యాయ సంఘమైన పీఆర్‌టీయూ ఉపాధ్యాయులకు ఎన్నో జీవోలను సాధించి పెట్టిందన్నారు. 30 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ, 61 సంవత్సరాల వయస్సు పెంపుదల, కేజీబీవీ ఉపాధ్యాయినులకు వేతనంతో కూడిన మెటర్నటీ సెలవులు సాధించినట్లు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న ప్రమోషన్లు, బదిలీలను ఇప్పించడంలో శ్రీపాల్‌రెడ్డి కీలక భూమిక పోషిస్తారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు అర్హత కేవలం టీపీఆర్టీయూకు మాత్రమే ఉందన్నారు. సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్ అద్దంకి సునీల్, నాయకులు యూసుఫ్ పాషా, తిరందాసు సత్తయ్య గాదె వెంకట్‌రెడ్డి, బొడ్డు నాగయ్య, తీగల శంకరయ్య, వీరమల్ల శ్రీనివాస్, వెంకటరమణ, భాస్కర్, గోపి పాల్గొన్నారు.

'రైతులను ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం'

మిర్యాలగూడటౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిండా ముంచుతోందని బీఆర్ఎస్ యువజన విభాగ నాయకులు ఎండీ.షోయబ్ అన్నారు. పట్టణంలోని ఓ రైస్‌మిల్లులో గురువారం మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ రైతులను కడుపులో దాచుకుంటే.. కాంగ్రెస్ పార్టీ రైతుల కడుపు కొడుతుందన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు మిల్లర్లతో మిలాఖత్ అయ్యారని ఆరోపించారు. కేసీఆర్ చేసిన పనులను అన్నదాతలు గుర్తుకు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరానాయక్, హతీరాంనాయక్, శివ, ప్రకాష్‌నాయక్, రవి, మహేష్ పాల్గొన్నారు.

మేలు జాతి దూడల ప్రదర్శన

పెద్దవూర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగారం గ్రామంలో గురువారం జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో పశు సంవర్ధకశాఖ సహకారంతో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, మేలు జాతి దూడల ప్రదర్శని ర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ నాగార్జునరెడ్డి, సూపర్‌వైజర్ నడ్డి బాలరాజుయాదవ్ దీర్ఘకాలికంగా గర్భందాల్చని పశువులను గుర్తించి చికిత్స నిర్వహించారు. ఎదలో ఉన్న వాటికి కృత్రిమ గర్భధారణ చేశారు. అదేవిధంగా చూడి పరీక్షలు చేసి దూడలకు నట్టల నివారణ మందులను వేసి పాల దిగుబడి పెంచే ఖనిజ లవణాల మిశ్రమాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు గాలి లింగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సతీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై నిర్లక్ష్యం తగదు : ఎంఈవో

మిర్యాలగూడ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం తగదని ఎంఈవో లావూరి బాలు అన్నారు. పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లను గురువారం ఆయన సందర్శించారు. ప్రభుత్వం పెంచిన డైట్, కాస్మొటిక్ చార్జీల ప్రకారం మెనూ అమలు చేయాలని వార్డెన్లను సూచించారు. పరిశుభ్రత పాటించాలని, నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. అనతంరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డెన్లు సంధ్యారాణి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను వెంటనే అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారి ఐలయ్య

పెద్దవూర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలుచేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఇప్పటి వరకు హామీల అమలులో కదలిక లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్క హామీని అమలుచేయడం లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందన్నారు. అదేవిధంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగు ప్రాజెక్టుల నిర్మాణాలను వెంటనే చేపట్టాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య, నాయకులు చిరు, దోరెపల్లి మల్లయ్య, బషీర్, రామకృష్ణ, కొండలు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన టెండర్ విధానాన్ని రద్దు చేయాలి



సర్కిల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్టర్లు

నల్లగొండటౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో నూతనంగా అమలు చేయనున్న గ్లోబల్ టెండర్ విధానాన్ని రద్దు చేయాలని జిల్లా ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సర్కిల్ కార్యాలయంలో ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జిల్లాకు వచ్చిన రూరల్ సీఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో నూతనంగా ప్రవేశపెట్టనున్న గ్లోబల్ టెండర్ విధానంతో సంస్థను నమ్ముకొని బతుకుతున్న వేలాది కుటుంబాలు రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయన్నారు. వెంటనే గ్లోబల్ టెండర్‌ను రద్దు చేసి తమకు న్యాయం చేయాలన్నారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

మత్స్య సంపదతో ఆర్థికంగా ఎదగాలి

కనగల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మత్స్య సంపదతో ఆర్థికంగా ఎదగాలని మత్స్యశాఖ అధికారులు అలీ, రఘురాం అన్నారు. మండలంలోని జీఎడవల్లి గ్రామంలోని చెరువులో గురువారం వారు 2.80 లక్షల చేప పిల్లలను వదిలారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ వంద శాతం సబ్సిడీపై అందిస్తున్న చేప పిల్లలను సద్వినియోగం చేసుకుని మత్స్యకారులు అభివృద్ధి చెందాలని సూచించారు. ఇదిలా ఉంటే మత్స్యసొసైటీ గ్రామ చైర్మన్ బొమ్మరబోయిన భార్గవ్ మాట్లాడుతూ చేప పిల్లలను సగానికి సగం తగ్గించారని, గతేడాది 8 లక్షల చేపల సీడును అందించగా, ప్రస్తుతం 2.80 లక్షల చేపలను మాత్రమే పంపిణీ చేశారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఖాసీం, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్రం

డిండి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించి శ్రమదోపిడీకి పాల్పడుతుందని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లకు కుదించి కార్మికులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 1920 అక్టోబరు 31న ఆవిర్భవించిన ఏఐటీయూసీ నిత్యం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో త్యాగాలు చేసిందన్నారు. ఈ నెల 11వ తేదీన మిర్యాలగూడలో జరిగే రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బూషిపాక లింగమయ్య, దేవయ్య, జవహర్‌లాల్, బాలరాజు, అంజి తదితరులు పాల్గొన్నారు.

పునరుజ్జీవంపై ఆశలు

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు ఇప్పటికే హామీలివ్వగా, ఈ పథకంపైనా సీఎం పాదయాత్రలో స్పష్టత వస్తుందనే చర్చ సాగుతోంది. ఈ ప్రాంతంలో రైతాంగం, ప్రజలు, కూలీలు, చేతివృత్తిదారులు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని, కష్టనష్టాలను సీఎం స్వయంగా తెలుసుకొని, మూసీ ప్రక్షాళన ఆవశ్యకతను సీఎం యావత్‌రాష్ట్ర ప్రజలకు తెలియజేస్తారని కాంగ్రెస్‌నేతలు పేర్కొంటున్నారు.

కాల్వల ఆధునికీకరణకు ఆదేశాలు?

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 180కిలోమీటర్ల మేర ప్రవహించే మూసీనదిపై నిజాం హయాం నుంచే జిల్లాలో చిన్నా, పెద్దా కలిపి 20వరకు కాల్వలు, కత్వలున్నాయి. వీటితో పాటు దిగువన సోలిపేట వద్ద ప్రాజెక్టు, శాలిగౌరారం వద్ద ప్రాజెక్టులు నిర్మించారు. వీటన్నింటి ద్వారా సుమారు 175 వరకు గొలుసుకట్టు చెరువులకు నీరందుతుంది. వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష ఎకరాలకు సాగునీరందుతోంది. ప్రధాన కాల్వల ఆధునికీకరణలో భాగంగా బునాదిగాని కాల్వ 98.64కి.మీ.కు ఇంకా 55.56కి.మీ పనులు చేపట్టాల్సి ఉండగా, రూ.269.46కోట్లు అవసరమని అంచన వేయగా, తాజాగా రూ.266.26కోట్లు ఇటీవల మంజూరుచేశారు. పిల్లాయిపల్లి కాల్వకు 66కి.మీ.కు 61.645కి.మీ పునరుద్ధరణ చేయాల్సి ఉండగా, రూ.86.22కోట్ల నిధులకు ప్రతిపాదనలున్నాయి. ధర్మారెడ్డిపల్లి కాల్వ 51.15కి.మీ.కు 29.72కి.మీ పనులు చేయాల్సి ఉండగా, రూ.123.98కోట్లు అవసరమవుతాయని అంచనావేయగా నిధులు మంజూరయ్యాయి. వీటితో పాటు పిల్లాయిపల్లి, అలీనగర్, భీమలింగం వంటి కాల్వలకు అవసరమైన కొద్ది మొత్తం నిధులు రూ.20కోట్ల అవసరమని, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి నీటిపారుదలశాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటిపారుదలశాఖాధికారులకు మంత్రి ఆదేశాలిచ్చారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఈ కాల్వల ఆధునికీకరణ పనులు వేగం పుంజుకునేలా సీఎం స్పష్టమైన హామీ ఇస్తారనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

భీమలింగం కాల్వనూ ఆధునికీకరించాలని డిమాండ్

సంగెం సమీపంలోని భీమలింగం కత్వ ద్వారా మొదలయ్యే భీమలింగం కాల్వ మోత్కూరు మండలం దత్తప్పగూడెం వరకు దాదాపు 10వేల ఎకరాల పైచిలుకు భూములకు సాగునీరిస్తుంది. ఈ కాల్వను కూడా ఆధునికీకరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కాల్వలో మార్గమధ్యలో అప్పిరెడ్డిపల్లి, తుర్కపల్లి సమీపంలో కుచించుకుపోవడం, వెల్వర్తి వద్ద కత్వ ఎత్తుగా ఉండడంతో తరచూ దిగువ ప్రాంతాల వరకు కత్వలకు గండికొడుతున్న ఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాల్వను ఆధునికీకరించే ప్రతిపాదనకు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళితే ఆమోదం లభించి కష్టాలు తీరుతాయని రైతులు పేర్కొంటున్నారు.

ABC సమాచారం

శాలిగౌరారం ఆర్ఐగా మహ్మద్ అబ్దుల్ రఫీ



అబ్దుల్ రఫీ

శాలిగౌరారం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా మహ్మద్ అబ్దుల్ రఫీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండలో భూసేకరణ అధికారి కార్యాలయం యూనిట్ 2లో ఆర్ఐగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఆర్ఐగా పనిచేసిన చిట్లంబట్ల రాజు నల్లగొండలోని భూసేకరణ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

ట్రేడర్స్ అధ్యక్షుడిగా రవీందర్‌గౌడ్

చింతపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మాల్ మార్కెట్ యార్డు ట్రేడర్స్ అధ్యక్షుడిగా చింతపల్లి మండలం సాయిరెడ్డిగూడెంకు చెందిన కేశగోని రవీందర్‌గౌడ్ ఎన్నికయ్యారు. గురువారం నిర్వహించిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా రవీందర్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ రైతులతో పాటు ట్రేడర్స్‌కి ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకుంటానని తెలిపారు. అనంతరం ట్రేడర్స్ ఆయన్ను సన్మానించారు.

ఆదర్శ రైతుల మండల కమిటీ

కట్టంగూరు, కేతేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరు, కేతేపల్లి మండలాల ఆదర్శ రైతుల మండల కమిటీని ఎన్నుకున్నారు. ఆయా మండల కేంద్రాల్లో గురువారం ఆదర్శ రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడు దొంతూరి శంకరయ్య, జిల్లా కమిటీ కార్యదర్శి బట్టు బిక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాల్లో నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కట్టంగూరు మండల అధ్యక్షుడిగా గండమళ్ల అంతయ్య, ఉపాధ్యక్షుడు కుంభం విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి పెద్ది వెంకన్న, కార్యదర్శిగా ఎర్కల సైదులు, కోశాధికారి బెజవాడ రామకృష్ణ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

● కేతేపల్లి మండల అధ్యక్షుడిగా కొప్పోలు గ్రామానికి చెందిన దుర్గం అంజయ్య, ఉపాధ్యక్షుడు మోదుగు సైదిరెడ్డి, కార్యదర్శి ఎ.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఎడవల్లి శ్రీనివాస్, సహాయకార్యదర్శి ఎ.విజయకుమార్‌రెడ్డి, సలహాదారులుగా డి.జానయ్య, జె.కృష్ణయ్య, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్లీనరీ సమావేశం రేపు

మిర్యాలగూడటౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జన సమితి ప్లీనరీ సమావేశాన్ని ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు పన్నాల గోపాల్‌రెడ్డి అన్నారు. మిర్యాలగూడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ప్లీనరీ సమావేశంతో పాటు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం 'పౌర సమాజంతో మాటా-ముచ్చట' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, విద్యావేత్తలు, మేధావులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో లావూరి క్రాంతికుమార్, గుండెబోయిన నాగేశ్వరరావు, సైదానాయక్, ప్రకాష్ నాయుడు, హరినాయక్, నగేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది : కాంగ్రెస్

చిట్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ప్రతి ధాన్యపుగింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి పోకల దేవదాస్, మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం చిట్యాలలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే లింగయ్య అసత్యాలు ప్రచారం చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డిపై చిరుమర్తి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం తలపెట్టిన మూసీ పునరుజ్జీవ పాదయాత్రకు రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మీనర్సింహ, జడల చినమల్లయ్య, నాయకులు కాటం వెంకటేశం, దుబ్బాక అమరేందర్‌రెడ్డి, ఎద్దులపురి కృష్ణ, వెంకటేశ్వర్లు, పరమేశం, మోహన్, రాంరెడ్డి పాల్గొన్నారు.

'మల్లన్న వ్యాఖ్యలు సరికాదు'

మిర్యాలగూడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు సరికాదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తలకొప్పుల సైదులు అన్నారు. గురువారం రాజీవ్‌భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లన్న గెలుపునకు పాటుపడిన ఎమ్మెల్యే బీఎల్ఆర్ తదితరులపై విమర్శలు చేయడం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య చిచ్చు పెట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగిలి లింగయ్య కిరణ్, కృష్ణ, సురేష్, లింగానాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్థలాన్ని కేటాయించాలి

దేవరకొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో కూరగాయల మార్కెట్‌కు స్థలాన్ని కేటాయించి మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల అంజయ్యయాదవ్ డిమాండ్ చేశారు. కూరగాయల మార్కెట్‌కు నిధులు మంజూరైనా అధికారులు స్థల సేకరణలో నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. దీంతో వ్యాపారులు అధిక రేట్లకు కూరగాయలు విక్రయిస్తున్నారని, మార్కెట్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

గుర్రంపోడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచారం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు దేవరకొండ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.